క్లుప్తంగా

మాస కల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సుదర్శన హోమం, స్వామివారి మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గన గోని రమేశ్, తాళ్లపల్లి బుచ్చయ్య, రత్నాకర్ రెడ్డి, చల్ల వెంకటరమణాదేవి, గోలి రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, మహేష్, గాదె శేఖర్,హరి శంకర్, రాజేష్, విశాల్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పొన్నంతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌కు తగిన మౌలిక సదుపాయలు కల్పించాలని మంగళవారం హైదరాబాద్‌లో క్యాంప్ కార్యాయలంలో రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కలిసి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తక్షణమే పాలకుర్తి బస్టాండ్ అభివృద్ధి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కలిసి శాఖ పరిధిలో రూ.2 లక్షలకుపైగా విలువ ఉన్న పనులకు మాత్రమే టెక్నికల్ క్యూసీ పెట్టాలని, రూ. 2 లక్షలోపు పనులకు క్యూసీ పెట్టకూడదని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

కొనసాగుతున్న దీక్షలు



జనగామ రూరల్: అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం దీక్షను రైస్ మిల్స్ డ్రైవర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మునీర్ ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ నిర్మించాలని 60 రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో దీక్షపడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి అండర్‌పాస్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కొండ వరలక్ష్మి,మేడ నాగమణి, ఎండీ బిస్మిల్లా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని అర్చకుడు జంగిలి ఆంజనేయులు అన్నారు. మంగళవారం బండనాగారంలో ఏకాదశి సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ భావాన్ని కలిగి ఉండాలని, పురాతన ధర్మాలు, పద్ధతులను భావి తరాలకు అందించాలన్నారు. భక్తులు బత్తిని బాలమల్లయ్య, పెసరు ధర్మయ్య, ఇజ్జగిరి కిష్టయ్య, నారాయణ, పల్లపు రామకృష్ణ, వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

చిల్పూరు: కొండాపూర్ గ్రామస్తులు తాగు నీటికి ఇబ్బంది పడుతుండటంతో మూడు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. కాగా, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నాయకులు గ్రామంలో మంగళవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కమీషన్‌లో కోత



- ఆఫీస్ మెయింటెనెన్స్ పేరుతో ఒక్కో అప్లికేషన్‌పై రూ.5 కటింగ్

తరిగొప్పుల: సమగ్ర కుటుంబ సర్వే ఫారాల్లో పొందుపరిచిన వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసిన ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ల కమీషన్ నగదులో కోత విధించి పంపిణీ చేస్తుండంతో సదరు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తమకు రావాల్సి కమీషన్ నగదులో కార్యాలయం మెయింటెనెన్స్ పేరుతో ఒక్కో ఫారంపై రూ.5 కోత విధిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు వేల సంఖ్యలో ఉండగా.. వాటిని త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాడానికి ప్రైవేట్ ఆపరేటర్లని నియమించుకోవడం జరిగింది. మండల వ్యాప్తంగా 6,501 సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులు అందాయి. కాగా, 31 మంది ప్రైవేట్ ఆపరేటర్లు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ ఆపరేటర్లు 6,469 కుటుంబాల వివరాలను నమోదు చేయడం జరిగింది. వీటికి గానూ ఒక్కో(ఫారం) కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తే ప్రైవేట్ ఆపరేటర్‌కి రూ.20 చెల్లిస్తామని అధికారులు తెలిపారు. తీరా ఇప్పుడు రూ.15 (5 కోత విధించి)తక్కువగా ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మండల పరిషత్ అధికారిని అడిగితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.5 తగ్గించి ఇస్తున్నామని అంటున్నారని పలువురు వాపోతున్నారు.

తగ్గించి ఇస్తున్నారు



మొదట్లో ఒక్కో ఫారానికి రూ.20 ఇస్తామన్నారు. తీరా ఇప్పుడు రూ.15 ఇస్తున్నారు. ఆఫీసు నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది కాదా. ఆఫీసు నిర్వహణ పేరుతో మా డబ్బుల్లో కోత విధించడం సరికాదు.

- మంచినీళ్ల హరిప్రసాద్, ప్రైవేట్ ఆపరేటర్

రూ.7 వేలకు పైగా రావాల్సి ఉంది



383 ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారు చెప్పిన ప్రకారం రూ.7,660 రావాల్సి ఉంది. కానీ ఇప్పుడు కట్ చేసింది పోను రూ.5,745 మాత్రమే ఇచ్చారు. త్వరగా కావాలని రాత్రింబవళ్లు చేశాం. ఇప్పుడు చూస్తే మాకు రావాల్సిన డబ్బుల్లో కోత విధించారు. వేలకు వేలు జీతాలు పొందే ప్రభుత్వ ఉద్యోగుల (టీచర్స్, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు)కు ఎలాంటి కోత విధించలేదు.

- బత్తిని పవన్, ప్రైవేట్ ఆపరేటర్

చలివేంద్రాలను వినియోగించుకోవాలి

- కలెక్టర్ రిజ్వాన్‌బాషా



చలివేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్: ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ప్రజలు చలివేంద్రాలను వినియోగించుకుని దాహార్తి తీర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద సెర్ప్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు వీలుగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. డీఆర్డీఏ వసంత, ఎల్‌డీఎం శ్రీధర్, సమాఖ్య మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లుట్ల బస్టాండ్ వద్ద..

లింగాలఘణపురం: నెల్లుట్లలో బస్టాండ్ వద్ద మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహం తీర్చే విధంగా ప్రతి రోజు తాగునీరు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీఓ రఘురామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసు రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ చంద్రశేఖర్

లింగాలఘణపురం: ఉపాధి హామీ కూలీలకు వేసవిలో తగిన వసతులు కల్పించాలని ఏపీడీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మడవెల్లిలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో టెంట్లు, తాగునీటి వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఈసీ సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు ఉన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్నతాధికారులు

జనగామ: వేసవిలో ఓల్టేజీ లేకుండా, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు పట్టణంలోని టౌన్–2 పరిధిలోని గణేష్‌వాడ, అంబేద్కర్‌నగర్‌లో అందనపు ట్రాన్స్ ఫార్మర్లను బిగించారు. మంగళవారం డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీ నారాయణ రెడ్డి, ఏడీఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 160 కేవీఏ సామర్థ్యం కలిగిన వాటిని బిగించారు. ఏఈ చంద్ర మోహన్, పట్టణ–2 సెక్షన్ ఎస్‌ఎల్‌ఐ, ఎల్‌ఐ, ఎల్‌ఎం, ఎల్‌ఎం హనుము, సత్యనారాయణచారి, మహేందర్, బాలరాజు, వీరేష్ ఉన్నారు.

నర్మెటలో..

నర్మెట: వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఓవర్‌లోడ్ రిలీఫ్ కోసం మండల కేంద్రంలో రెండు అదనపు 63 కేవీఏ డీటీఆర్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డీఈ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో సిబ్బందితో కలిసి ఆయన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి మాట్లాడారు. ఏడీఈ ఎం. అనిల్ కుమార్, ఏఈ పి.సుధాకర్, సబ్ ఇంజనీర్ రాజు, రాజయ్య, స్వామి, బాలు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



నర్మెట: వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

నర్మెట: టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి వంటశాల, తరగతి గదులు, డార్మెటరీ గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్‌ఎం భూక్య కిష్టకు సూచించారు. డీటీడీఓ ప్రేమకళ, జీసీడీఓ గొసియా బేగం, తహసీల్దార్ వెంకట రామానుజాచార్యులు, ఎంపీడీఓ బి. అరవింద్ చౌదరి ఉన్నారు.

మల్కాపూర్ జీపీని సందర్శించిన అదనపు కలెక్టర్

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సందర్శించారు. వేసవి ఎండలు ముదురుతున్నందున తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్ ఉన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న చందునాయక్

జనగామ రూరల్: దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులు కుంటలు నింపి రైతుల పంటలు కాపాడాలని, అలాగే ఎండిన పంటలపై సర్వే చేపట్టి ఎకరాకు రూ.50 నష్టపరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ.. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన ఆర్డీఓ కార్యాలయాల ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య, బీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రమావత్ మీట్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు కొనసాగించాలి



డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరై ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన హైదరాబాద్‌లోని అసెంబ్లీ లాబిల్లో మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలో సాగునీరు అందక వేలాది ఎకరాల్లో వరిపొలాలు ఎండిపోయాయని వెంటనే నీళ్లు విడుదల చేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో బట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి ఉన్నారు.

సన్మానం



జనగామ: జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్‌ను ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డబోయిన హరికుమార్, అడ్వకేట్ సంఘం సభ్యులు రెడ్డబోయిన రాజు, ఇట్టబోయిన జోత్స్న, బండి మధుసూదన్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ముదిరాజ్ కార్పొరేషన్ అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని చైర్మన్ అన్నారు.

ప్రత్యేక పూజలు



జనగామ: పట్టణంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆయలంలో మంగళవారం పార్వతీ, పరమేశ్వరులు, హనుమంతుడి ఆలయ ప్రధాన పూజారి గంగు సాంబమూర్తి మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమామహేశ్వరునికి పంచామృతాభిషేకాలు, ఆంజనేయ స్వామిని జిల్లేడుమాల, మల్లె పూలు, తమలపాకులతో అలంకరణ చేశారు. భక్తులు ధర్మమూర్తి, శ్రీకాంత్, చారి, అరుణ్, విగ్నేష్, ఈశాన్విత తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు..ఆందోళనలో రైతులు



ఎండిన పంట వద్ద దిగాలుగా కూర్చున్న రైతు

చిల్పూరు: సాగునీరు అందక పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం పరమేశ్‌కు ఎకరం పొలం ఉంది. వరి నాటు వేసే సమయంలో బోర్ ద్వారా సాగు నీరు అందినప్పటికీ ప్రస్తుతం బోరు పనికిరాకుండా పోయింది. దీంతో పొలం ఎండిపోవడంతో దిగాలు చెందుతున్నాడు. కనీసం కాల్వల ద్వారా సాగునీరు అందించి ఉంటే పంటలను కాపాడుకునే వారిమని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు వేలం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతలో పలు హక్కులకు వేలం పాటను నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జీపీ కార్యదర్శి నర్సింహచారి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశువుల రహదారి, తైబజార్, డక్కా హక్కులను పొందేందుకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నామని అన్నారు. పశువుల రహదారికి రూ. 60 వేలు, తైబజారుకు రూ. 25 వేలు, డక్కాకు రూ. 5వేల డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే ఈ వేలంలో పాల్గొనాలని చెప్పారు.

విజయవంతం చేయాలి

రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ వద్ద జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు మనిత్‌రాజ్, ప్రవీణ్, వరుణ్, జంపన్న, రమేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో విజిలెన్స్, మైనింగ్ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా పలు వాహనాలను సీజ్ చేశారు. ఎలాంటి పర్మిషన్లు, పత్రాలు లేని వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపా. పట్టుకున్న వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై ఎస్‌కే హమీద్ వెల్లడించారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ రూరల్: న్యాయవాదిని హత్య చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం చేసి శిక్షలను కఠినం చేయాలన్నారు. రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నక్క సిద్దులు, బాలకృష్ణ, చంద్రశేఖర్, నర్సింహులు, మురళీ, లీగల్ సెల్ రవీందర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తెలంగాణ సర్వమతాలకు నిలయం

దేవరుప్పుల: భారత దేశంలోకెల్లా తెలంగాణ రాష్ట్రం సర్వమతాలకు నిలయమని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి అన్నారు. మంగళవారం కామారెడ్డిగూడెం మజీదులో ఆయన రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకుని దావత్–ఇ–ఇఫ్తార్.. ఏర్పాటు చేసి ముస్లింలకు పవిత్ర రంజాన్ శుభా కాంక్షలు తెలియజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారెపల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ కార్మికుల సమస్యల్ని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండె మల్లేష్, ఆకారపు అశోక్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

కొడకండ్ల: మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు బైక్‌పై త్రిపుల్ రైడ్ వెళ్తుండగా సీఐ పట్టుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

జయప్రదం చేయండి

లింగాలఘణపురం: ఈ నెల 28వ తేదీనన జనగామ ఎస్‌ఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే యాదవ శంఖారావ సభను జయప్రదం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాల్గొని మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు సంగి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

బావుల వద్దకు దారి ఏర్పాటు చేసుకోవాలి

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్దకు అన్నదాతలు దారులను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు సూచించారు. మంగళవారం బండనాగారం గ్రామంలో బావులవద్దకు రైతులు వెళ్లే దారిలో సిద్దులు అనే వ్యక్తి ముళ్లకంప వేసి వెళ్లకుండా చేస్తున్నాడని వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో తహసీల్దార్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, రైతులతో మాట్లాడి తీర్మానం చేయించి బావుల వద్దకు వెళ్లేలా ముళ్లకంపను తొలగించడం జరిగిందన్నారు.

నేత్ర వైద్యశిబిరం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించి 45 మందిని కంటి శస్త్ర చికిత్సకు హైదరాబాద్‌కు తరలించినట్లు డాక్టర్ సిద్దార్థరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్స నిర్వహించి అవసరమైన రోగులకు అద్దాలు, ఉచిత భోజన వసతి కల్పించామన్నారు. అప్తాలమిక్ అధికారి రాజన్న, సీహెచ్‌ఓ రమణమ్మ, పీహెచ్‌ఎన్ లిల్లీడెబోరా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాలకుర్తి: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బమ్మెర గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బమ్మెరకు చెందిన బెల్లం కొండ సోమయ్య(50) ఇంటి ఆవరణలోని నీటి సంపులో దిగి శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఎర్త్ వైరు షాక్ కొట్టడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరూ ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, పార్టీ మండల నాయకుడు వడ్లకొండ సుధాకర్ కోరారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని షాపల్లి గ్రామంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్మెట: హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తతోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఉపాధ్యాయులతో మన్ననలు పొందారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం సామల కమల మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్థాయన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ వి. ఆశాలత, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం దూడల రమేష్, ఉపాధ్యాయలు పి. విద్యావతి, గుర్రాల కరుణాకర్, అంగన్ వాడీ టీచర్లు మమత, సంధ్య, ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ, రాజు, వి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్త కుటుంబానికి చేయూత



మృతురాలి భర్తకు ఆర్థికసాయం అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారి

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సీహెచ్ మహేశ్వరి ఇటీవల గుండె పోటుతో మరణించిన విషయం విదితమే. బాధితురాలి కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, ఆశ కార్యకర్తలు మానవతా దృక్పథంతో స్పందించి రూ.61 వేలు జమ చేయగా, ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, వైద్యులు, ఆశ కార్యకర్తలు రూ 47,200, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం తరఫున రూ.25 వేలు.. మొత్తం రూ 1,32,200 కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్ రావులు మృతురాలు భర్త సీహెచ్ యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమార్తెకు అవుట్ సోర్సింగ్ లేదా ఆశ కార్యకర్తగా నియమించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతృత్వం చాటిన జిల్లా, మండలాల వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు అభినందించారు.

నాణ్యమైన సేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

బచ్చన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలను అందించాలని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని అలింపూర్ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి పరికరాలను, వసతులను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆస్పత్రిని ఏక్యాస్ కార్యక్రమంలో ఎంపిక చేశామని, దానిలో భాగంగా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఆస్పత్రుల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీదేవి, మండల వైద్యాధికారి సృజన, ఝాన్సీ, రమ్య, మమత, క్వాంటిటీ మేనేజర్ సంతోష్, ఫార్మాసిస్ట్ బొడ్డు శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యములో మే 1 నుంచి 31వ తేదీ వరకు 14 ఏళ్ల లోపు వయస్సు కలిగిన బాలబాలికలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకట్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఇతర క్రీడల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు నిర్వహించదలిచిన క్రీడా వివరాలు, గ్రామము, ప్రదేశం పూర్తి వివరాలతో తమ దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో ఏప్రిల్ 4వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9182552593 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జమిలి ఎన్నికలే దేశాభివృద్ధికి సోపానం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: జమిలి ఎన్నికలే దేశాభివృద్ధికి సోపానమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ అధ్యక్షతన ఒక దేశం ఒకే ఎన్నిక వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వహణతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మార్క ఉపేందర్, దేవరాయ ఎల్లయ్య, ప్రోగ్రాం కన్వీనర్ బజ్జూరి లక్ష్మి నర్సయ్య, బండారి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి బండ శ్రీనివాస్, జంగా నరసింహ రెడ్డి, చింతకింది సంతోష్ గణేష్, యాకయ్య, బిజ్జ రమేష్, వెంకటేశ్వర్లు, నటరాజుపాల్గొన్నారు.

రూ.52.93 లక్షలకు సంత వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న డీపీఓ స్వరూప, అధికారులు

రఘునాథపల్లి: జిల్లాలో అతి పెద్ద వారసంతలో ఒకటైన రఘునాథపల్లి అంగడి వేలం రూ.52.93 లక్షలకు చేజిక్కించుకున్నారు. మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే గొర్రెలు, మేకల అంగడిని దక్కించుకునేందుకు 20 మంది ఔత్సాహికులు పోటీ పడ్డారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు డీపీఓ నాగపురి స్వరూప, ఎంపీఓ వెంకటేశ్వర్లు, స్పెషలాఫీసర్ కాకి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి కె. బాలకిషన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఏడాది కాలం పాటు నిర్వహించే సంతకు ప్రభుత్వం నిర్ణయించిన ఆఫ్‌సెట్ ప్రైజ్ రూ 46,44,442 గా నిర్ణయించారు. వేలంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన దూదిమెట్ల వెంకటేశ్వర్లు అత్యధికంగా రూ 52.93 లక్షలకు పాడి అంగడిని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్కపురం లక్ష్మయ్య, కారోబార్ ఎండీ అజ్మత్, దుబ్బాక నాగేష్, కావటి యాదగిరి, రాజయ్య ఉన్నారు.